సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 4 । జనవరి । 2025



చిరుత కలకలం

రామసముద్రం మండలంలోని మూగవాడి, గుండ్లపల్లి పరిసర ప్రాంతాల పొలిమేరల్లో శుక్రవారం ఉదయం చిరుత పులి సంచరించిందనే కలకలం రేగింది. -IIలో



హంద్రీనీవా కాలువలో ఇక నీరు రానట్టే?

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పరమటి ప్రాంతాల ప్రజలకు కల్పతరువవు తుందనుకున్న హంద్రీనీవా కాలువలో కృష్ణా జలాలు భవిష్యత్తులో రానట్టేనని తెలుస్తోంది. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.130	రూ.160
రెండోరకం	రూ.80	రూ.120

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 120 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఆల్ ఇండియా క్యారం పోటీలకు అంపైర్‌గా కృష్ణయ్య



నందలూరు: ఆలిండియా క్యారమ్స్ పోటీలకు అంపైర్‌గా ఉమ్మడి వైఎస్‌ఆర్ కడప జిల్లా నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సూరే కృష్ణయ్య ఎంపికయ్యారు. జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు నెల్లూరులో నిర్వహించనున్న ఆలిండియా క్యారమ్స్ పోటీలకు ఈయన అంపైర్‌గా వ్యవహరించనున్నట్లు ఏపీ స్టేట్ క్యారం అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్‌కే జలీల్, కడప జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ చైర్మన్ పోలంకి గణేష్‌బాబు తెలిపారు. జిల్లా నుంచి జాతీయస్థాయి అంపైర్‌గా ఎంపికవడం పట్ల అభినందనలు తెలిపారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మాట్లాడుతున్న సిద్దవటం రేంజర్ కళావతి

సిద్దవటం: వైఎస్‌ఆర్ జిల్లా అధికారి సూచనల మేరకు సిద్దవటం మండలంలో 20 వేల మొక్కలు నాటాలనే లక్ష్యంగా నర్సరీ ఏర్పాటు చేస్తామని సిద్దవటం రేంజర్ కళావతి తెలిపారు. శుక్రవారం ఆమె ఇక్కడ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. మొక్కలతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ పొలాల్లో , ఇంటి పరిసర ప్రాంతాల్లో మొక్కలు విరివిగా నాటాలన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం



గంధాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

సిద్దవటం: మండలంలోని మాచుపల్లె గ్రామ సమీపంలో వెలసిన హజరత్ సయ్యద్ షావలి దర్గాలో శుక్రవారం రాత్రి గంధం మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గంధాన్ని పూల చాందినిలో పకీర్ల మేళ తాళాలతో, బ్యాండ్ వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. గంధం దర్గాచేరిన తరువాత ఫాతేహా నిర్వహించారు.కార్యక్రమంలో మాచుపల్లె గ్రామ పెద్దలు, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో కాంట్రాక్ట్ ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామ గిడ్డయ్య తెలిపారు. 15 ఖాళీలు ఉన్నాయని.. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తు నమూనాను సి ఎఫ్ డబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకొని, భర్తీ చేసిన దరఖాస్తులను నిర్దేశించిన రుసుముతో పోస్టుకు సంబంధించిన సర్టిఫికెట్లను జతపరచాలని తెలిపారు. పూరించిన దరఖాస్తులను ఈ నెల 4 నుంచి 17వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కడప పాత రిమ్స్‌లో గల వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

ప్రజల్లో న్యాయవిజ్ఞానం పెరిగేలా కృషిచేయాలి



న్యాయవాదులతో కలసి ఐఏఎల్ డైరీని ఆవిష్కరిస్తున్న 5వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి

రాయచోటి అర్బన్: ప్రజల్లో న్యాయవ్యవస్థ, రాజ్యాంగం, చట్టాల పట్ల పరిజ్ఞానం పెరిగేలా భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) కృషిచేయాలని రాయ చోటి 5వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి అన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో నిర్వహించిన ఐఏఎల్–2025 డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదే శానుసారం న్యాయవిజ్ఞాన సదస్సులు దేశవ్యాప్తంగా జరుగతున్నాయన్నారు. అయినప్పటికీ ప్రజల్లో చట్టాలపట్ల, రాజ్యా ంగ పట్ల మరింతగా విజ్ఞానం పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

- భారత రాజ్యాంగం, చట్టాల గురించి ప్రజలందరికీ వివరించేందుకు భారత న్యాయవాదుల సంఘం వచ్చేవారం నుంచి చైతన్యసదస్సులను నిర్వహిస్తున్నట్లు ఐఏఎల్ ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట ఈశ్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆనంద్‌కుమార్, రెడ్డియ్యలు అన్నారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ అధ్య క్షుడు ఎస్.ప్రభాకరరెడ్డి, ప్రధాన కార్యదర్శి రెడ్డెయ్య. సహాయకార్యదర్శి డి.నాగముని, పీపీ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పులులపై నిఘానేత్రం

- శ్రీశైలం టు శేషాచలం అడుగులు
- శ్రీశైలం బయోల్యాబ్‌లో విశ్లేషణ ప్రక్రియ
- డేటాలోని చిత్రాలు పరిశీలన
- 45రోజుల పాటు అడవిలో లెక్కింపు





శేషచలం



రాజంపేట: నాగార్జునసాగర్–శ్రీశైలం అభయారణ్యంలో పులుల కారిడార్ విస్తరిస్తోంది. నల్లమల నుంచి శేషాచలం అడవుల వరకు పులుల సంచారం ఉన్నట్లు అటవీశాఖ గుర్తించిన సంగతి విధితమే. గతంలో పులులు తిరిగే ప్రాంతం గుంటూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాల పరిధిలో మాత్రమే ఉండేది. ఆ మూడు జిల్లాలోని నల్లమల్ల అడవుల్లో పులులు సంచరించేవి. కొన్నేళ్లుగా ఇవి తిరిగే కారిడార్ నల్లమల్ల నుంచి వైఎస్సార్, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలో శేషాచలం అడవుల వరకు విస్తరించి ఉంది. తరుచూ నిర్వహిస్తున్న పులుల గణనలో ఈ విషయం స్పష్టమైంది. నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వు (ఎన్ఎస్‌టీఆర్)వారి ఆధ్వర్యంలో పులులు గణన చేపడుతున్నారు. పులులు గణన రెండు బ్లాకుల్లో జరుగుతోంది. నాలుగేళ్లకొకసారి చేసే గణన బ్లాక్–3లోకి వస్తుండగా , ప్రతి ఏడాది జరిపే గణన బ్లాక్–4 కిందికి వస్తుంది. ఇటీవల బ్లాక్–4లోని వార్షిక గణనలో టైగర్ కారిడార్ ప్రాంతంలో గత యేడాదిలో ఫిబ్రవరి 20 నుంచి అటవీశాఖాధికారులు గణన ప్రక్రియ చేపట్టిన సంగతి తెలిసిందే.



పెనుశిల అభయారణ్యంలో చెట్టు అమర్చిన కెమరా

ఎక్కడెక్కడా..

టైగర్ కారిడార్ నంద్యాల, గిద్దలూరు, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి డివిజన్లలో నిర్వహించారు. నంద్యాల డివిజన్‌లోని చలమరుద్రవరం (రేంజ్), గిద్దలూరులో గుండ్లకమ్మ, వైఎస్సార్ జిల్లాలో ప్రొద్దుటూరు, వనిపెంట, పోరుమామిళ్ల, బద్వేలు, సిద్దవటం, ఒంటిమిట్ట, ముద్దనూరు, అన్నమయ్య జిల్లాలో చిట్వేలు, రాయచోటి , బాలపల్లె తిరుపతి జిల్లాలో భాకరాపేట, తిరుపతి రేంజిలోని అటవీ ప్రాంతాల్లోని సాంకేతిక డిజిటల్ కెమెరాలు అమర్చిసర్వే చేశారు. ప్రతి రెండు చదరుపు అడుగులకు రెండు కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఆయా రేంజిలలో గత యేడాది 188 లోకేషన్లకు మొత్తం 376 కెమెరాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 127 కెమెరాలు అమర్చారు. 40రోజుల పాటు జరిగిన గణనలో 20 రోజులకొక సారి కెమెరాలు తీసి వాటిలోని చిత్రాలను సేకరించారు. అదే ప్రదేశాలలో మళ్లీ కెమెరాలు ఏర్పాటుచేయనున్నట్లు అటవీవర్గాల సమాచారం. కెమెరాల్లోని డేటాను ఆయా అటవీశాఖాధికారులు శ్రీశైలంలోని టైగర్ బయోల్యాబ్‌కు పంపనున్నారు. వాటిలోని చిత్రాలను బయోల్యాబ్ ప్రతినిధులు క్షుణ్ణంగా విశ్లేషించనున్నారు. గత ఏడాది పోరుమామిళ్ల, వనిపెంట అడవుల్లో ఆరు పలులు కెమెరాలకు చిక్కినట్లుగా అటవీ అధికారుల నుంచి అందని ప్రాథమిక సమాచారం.

అభయారణ్యాలు

- శేషాచలం (బయోస్పియర్)
- లంకామల్లేశ్వర వన్యప్రాణి అభయారణ్యం
- పెనుశిల లక్ష్మీనరసింహా అభయారణ్యం

ప్రాథమికంగా 8 నుంచి 10 పులులు సంచారం

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని టైగర్ కారిడార్ చేపట్టిన పులుల గణనలో ప్రాథమికంగా 8 నుంచి 10 లోపు పులులను అధికారులు గతంలో గుర్తించారు. వాటి సంఖ్య ఈ ఏడాది పెరిగి ఉంటుందని అటవీశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అడవుల్లో అమర్చిన విదేశీ సాంకేతిక డిజిటల్ కెమెరాల ద్వారా వాటి సంఖ్యను కొనుగొన్నారు.

- శ్రీశైలంలోని టైగర్ బయోట్యాబ్‌లో శాస్త్రవేత్తలు కెమెరాల్లో లభ్యమైన చిత్రాలపై విశ్లేషణ ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

పెరుగుతున్న పులులు సంఖ్య

2021లో ఆరుపులులు ఉండగా, 2022లో వాటి సంఖ్య తొమ్మిదికి చేరినట్లు అటవీ వర్గాల సమాచారం. 2019లో బద్వేలు, సిద్దవటం అటవీ ప్రాంతాల్లో కూడా పులులు ఉండేవని అప్పటి సమాచారం. ఈ సారి గణనలో అవి కెమెరాలకు చిక్కలేదు. అయితే పెనుశిల అభయారణ్యం, శేషాచలం అటవీ ప్రాంతాల వైపు వెళ్లినట్లు అటవీవర్గాలు భావిస్తున్నాయి. చిరుతలు మాత్రం కెమెరాకు చిక్కుతున్నాయి. పెనుశిల అభయారణ్యానికి సోమశిల వెనుకజలాలు అడ్డుగా ఉండటం వల్ల రాలేకున్నాయి.



పెనుశిల లక్ష్మీనరసింహ అభయారణ్యంలో చిరుత

అడవిలో చెట్లకు కెమెరాలు అమర్చాం



శేషాచలం అటవీ ప్రాంతంలో చెట్ల కెమెరాలు అమర్చాము. పులి, చిరుత కెమెరాలో పడితే వివరాలు వెల్లడిస్తాము. సర్వే జరుగుతోంది. టైగర్ కారిడార్ పరిధిలో పులల గణన జరుగుతుంది. –జగన్నాథ్‌సింగ్, జిల్లా అటవీశాఖాధికారి, రాజంపేట

కరువు బృందం పర్యటన
మూడు గంటలే!

- 7న కేంద్ర బృందం రాక
- 8న తుమ్మనంగుట్టలో పరిశీలన

బి.కొత్తకోట: జిల్లాలో కరువు పరిస్థితులతో అల్లాడిపోతున్న రైతుల పరిస్థితులను పరిశీలించేందుకు వస్తున్న కేంద్ర కరువు బృందం పర్యటన ముచ్చటగా మూడు గంటలే సాగనుంది. కేంద్రం నుంచి వస్తున్న బృందం పంట పొలాలను చూస్తారు, సాయం చేస్తారన్న ఆశతో ఎదురుచూస్తున్న రైతులకు తీవ్ర నిరాశే మిగలనుంది. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో గత ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలను రైతులు నష్టపోయారు. ప్రభుత్వం19 మండలాల్లో కరువు నెలకొందని ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో కేంద్ర కరువు బృందం పర్యటన కేవలం మూడు గంటలు మాత్రమే సాగనుండటం గమనార్హం. బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్ సమీపంలోని తుమ్మనంగుట్ట గ్రామంలో పరిశీలన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అంటే 7న హార్సిలీహిల్స్‌కు చేరుకునే బృందం దూరం పర్యటించకుండా వారు బస చేసిన కొండకు ఐదు కిలోమీటర్ల దూరంలోని గ్రామాన్ని ఎంపిక చేశారు. ఈ గ్రామంలో వ్యవసాయశాఖ ఏర్పాటు చేసే ఫొటో ప్రదర్శన, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తిలకిస్తారు. తర్వాత రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. ఈ మొత్తం కార్యక్రమాలను మూడు గంటల్లో ముగించాక బృందం బెంగళూరుకు తిరిగి వెళ్తుంది. ఈనెల7న ఢిల్లీ నుంచి బెంగళూరు విమానాశ్రయం చేరుకుని, అక్కడి నుంచి నేరుగా హార్సిలీహిల్స్ వచ్చి బస చేస్తారు. 8న టీమ్ లీడర్ అయిన పాలసీ, కోఆర్డినేషన్స్ విభాగం సంయుక్త కార్యదర్శి పెరిన్‌దేవి, సభ్యులైన డెప్యూటి డైరెక్టర్ సుప్రియా మాలిక్, నీతి అయోగ్ పరిశోధనా అధికారి అనురాధ బటనా, తాగునీటి సరఫరా, పారిశుద్య విభాగం డిప్యూటీ అడ్వయిజర్ ఆశిశ్ పాండేలు తుమ్మనంగుట్టలో క్షేత్రస్థాయి పర్యటన ప్రారంభిస్తారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పంట పొలాలను పరిశీలిస్తారు. తర్వాత తిరిగి బెంగళూరు వెళ్లి అక్కడి నుంచి విజయవాడ చేరుకుంటారు. 9న సీఎం చంద్రబాబుతో సమావేశం అనంతరం తిరిగి ఢిల్లీ వెళ్తారు.

వైఎస్సార్ సీపీలో నియమాకాలు

కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాకు సంబంధించి వివిధ నియమాలు చేపడుతూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

వైస్ ప్రెసిడెంట్లు: పల్లపు రమేష్(రాయచోటి), యర్రప్ప రెడ్డి అజంతమ్మ(రాజంపేట), టంగుటూరు కృష్ణారెడ్డి(రైల్వేకోడూరు), నల్లారి శ్రీకర్‌రెడ్డి (పీలేరు), బయసాని చంద్రశేఖర్‌రెడ్డి (తంబళ్లపల్లె), సీహెచ్ రామచంద్రారెడ్డి(మదనపల్లె),

జనరల్ సెక్రటరీ: ఆవుల నాగభూషణ్‌రెడ్డి(రాయచోటి), సిద్దవరం గోపిరెడ్డి(రాజంపేట), డి.చిన్న వెంగళ రెడ్డి(రైల్వేకోడూరు), ఎస్.యోగేంద్ర(పీలేరు) రవీంద్రారెడ్డి(తంబళ్లపల్లె),ట్రెజరర్: ఆవుల విష్ణువర్దన్‌రెడ్డి (రాయచోటి),

ఆర్గనైజేషనల్ సెక్రటరీ: సుగవాసి శ్యాం కుమార్(రాయచోటి),చిన్న ఆవుల చిన్నప్పరెడ్డి(రాయచోటి), బి.రామ్మోహన్‌నాయుడు(రాజంపేట), జి.త్రినాథ్(రాజంపేట), సి.శ్రీనివాసులరెడ్డి(రైల్వేకోడూరు), దేవరాజు(రైల్వేకోడూరు), ఎస్.వెంకట రమణారెడ్డి(పీలేరు), రాంప్రసాద్‌నాయుడు(పీలేరు), మాలిక్ (తంబళ్లపల్లె), కె.గిరిధర్‌రెడ్డి(తంబళ్లపల్లె), లియాఖత్ అలీ (మదనపల్లె), సదాశివరెడ్డి (మదనపల్లె).

సెక్రటరీ యాక్టివిటీ: వి.వెంకట రమణారెడ్డి(రాయచోటి), ఎస్‌కే సుబాన్‌బాష(రాయచోటి), రెడ్డిమాసి రమేష్‌బాబు(రాజంపేట), ఎ.వరదరాజు (బాబు) (రాజంపేట), ఎం.సుబ్బరామరాజు(రైల్వేకోడూరు), మాదినేని కనకరాజు(రైల్వేకోడూరు), కుమార్ నాయుడు(పీలేరు), ఆనంద్ (పీలేరు), సీవీ రమణ, మధుసూదన్‌రెడ్డి (తంబళ్లపల్లె), నందకిశోర్‌రెడ్డి, జి.నాగరాజారెడ్డి (మదనపల్లె),

అధికార ప్రతినిధులు: ఎస్.విజయ్‌భాస్కర్ (రాయచోటి), పి.విశ్వనాథరెడ్డి(రాజంపేట), పి.సుకుమార్ రెడ్డి(రైల్వేకోడూరు) జి.జయరామచంద్రయ్య(పీలేరు), జయసింహారెడ్డి (తంబళ్లపల్లె), జింకా వెంకట చలపతి(మదనపల్లె)

ముగిసిన కేంద్రమంత్రి పర్యటన

కడప సెవెన్‌రోడ్స్: కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళిక శాస్త్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ జిల్లాలో తన మూడు రోజుల పర్యటన ముగించుకొని శుక్రవారం ఉదయం రోడ్డు మార్గాన తిరుపతి రేణిగుంట విమానాశ్రయంకు బయలుదేరి వెళ్లారు. కేంద్ర మంత్రికి కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి ఘన వీడ్కోలు పలికారు. అలాగే ఎమ్మెల్యేలు మాధవిరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, కృష్ణ చైతన్య రెడ్డితోపాటు కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, మున్సిపల్ కమీషనర్ మనోజ్ రెడ్డి, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ ఇమ్రాన్, ఇంఛార్జి సీపీవో హాజరతయ్య తదితరులు మంత్రికి వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

'స్టాఫ్ నర్స్' నియామకాలకు శ్రీకారం

- వైద్య ఆరోగ్య శాఖ జోన్–4లో నోటిఫికేషన్
- 17వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 (రాయలసీమ జిల్లాలు) పరిధిలో ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదలైంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక వచ్చిన తొలి నోటిఫికేషన్ ఇదే. కాగా అంతకుముందు ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో వైద్య ఆరోగ్య శాఖలో పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు జరిగాయి. ప్రధానంగా కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌ల రిక్రూట్‌మెంట్ పెద్ద ఎత్తున జరిగింది. దీంతో వందలాది మంది అర్హులైన నిరుద్యోగులు స్టాఫ్ నర్స్‌లుగా ఉద్యోగాలు పొందారు.



అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

జోన్–4 పరిధిలో 600కు పైగా 'స్టాఫ్ నర్స్' ఖాళీలు...

వైద్య ఆరోగ్య శాఖ అధికారులు జోన్–4 పరిధిలోని రాయలసీమ ప్రాంత జిల్లాల పరిధిలో దాదాపు 600 స్టాఫ్ నర్స్ పోస్టులు భర్తీ చేయాలని అధికారులు గుర్తించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో నియామకాలకు అడ్డుకట్ట పడింది. దీంతో అర్హులైన వారు ఆందోళనలో పడ్డారు. తాజాగా కూటమి ప్రభుత్వం కేవలం 150 పోస్టుల భర్తీకి పచ్చ జెండా ఊపింది. అర్హులైన వారు ఈ నెల 3వనుంచి 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కడప పాత రిమ్స్‌లోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం దరఖాస్తులను సమర్పించాలి. దరఖాస్తు విధానం ఇతర పూర్తి వివరాలకు సీఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలి. కాగా అభ్యర్థుల నుంచి దాదాపు 12 వేలకు పైగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది.

గత ప్రభుత్వంలో 1,550పైగా నియామకాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో వైద్య ఆరోగ్య శాఖ అత్యంత బలోపేతంగా మారింది. వెల్లువలా వివిధ కేడర్‌లకు సంబంధించిన నియామకాలు జరిగాయి. ఎంతలా అంటే ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేస్తూ వచ్చారు. దీంతో అర్హులైన వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం లభించింది. కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో రాయలసీమ జిల్లాల నుంచి కేవలం స్టాఫ్ నర్స్‌ల నియామకాలు కేవలం రెండు నోటిఫికేషన్‌లకు గాను దాదాపు 1,550 మందికి పైగా ఉద్యోగాలు పొందడం విశేషం.

పక్కాగా ఎంపిక ప్రక్రియ




ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 150 మంది స్టాఫ్ నర్స్ నియామకాల కోసం చర్యలు చేపడుతున్నాం. అర్హులకు ఉద్యోగాలు వచ్చేలా పటిష్టవంతంగా రిక్రూట్మెంట్ ప్రక్రియను చేపడుతున్నాం. ఈ నియామకాల ద్వారా వైద్య విధాన పరిషత్ తో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎంపికైన స్టాఫ్ నర్స్ లను నియమిస్తాం.

– డాక్టర్ రామ గిడ్డయ్య, రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం

ఇసుక నిల్వలపై దొంగలు పడ్డారు!

- ముదివేడు రిజర్వాయర్ పనుల కోసం భారీ నిల్వలు
- ఆపై టీడీపీ నేతల ఎన్‌జీటీ కేసుతో ఆగిన పనులు
- ఇసుక తరలింపునకు 3 టిప్పర్లు, ఒక జేసీబీని పంపిన టీడీపీ నేతలు,
- అడ్డుకున్న గ్రామస్తులు
- ఆలస్యంగా స్పందించిన రెవెన్యూ, మైన్స్, పోలీసులు



రిజర్వాయర్ వద్ద ఇసుక నిల్వలు



జేసీబీ పనిని అడ్డుకున్న రైతులు

బి.కొత్తకోట/కురబలకోట: తంబళ్లపల్లె నియోజకవర్గంలో నాలుగు మండలాల ప్రజలకు తాగునీరు, 35 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన ముది వేడు రిజర్వాయర్ పనులను టీడీపీ నేతలు జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో కేసు వేసి పనులను అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ పనుల కోసం కాంట్రాక్టు సంస్థ కురబలకోట మండలం ముదివేడు సమీపంలో చేపట్టిన రిజర్వాయర్ పనులకు భారీగా ఇసుక నిల్వలను సిద్ధం చేసింది. పనులు సాగుతుండగానే టీడీపీ నేతలు తమ ఉనికి కోల్పోతామన్న భయంతో ఎన్‌జీటీ ద్వారా పనులు ఆపివేయించారు. పనుల వ్యవహారం ఎన్‌జీటీ కేసు మేరకు ఇసుక, కంకర, షెడ్లు, వాహనాలు, యంత్రాలు ఏమున్నా అలాగే ఉంచేశారు. ప్రాజెక్టు పనులను అడ్డుకోవడమేకాక ఇసుక దోపిడీకి సిద్ధపడ్డారు. ఈ నేపథ్యంలో శుక్రవా రం ఈ ఇసుకను దోచుకునేందుకు కొందరు టీడీపీ నేతలు తెర వెనుక మంత్రాంగం నడిపారు. ఉదయాన్నే మూడు టిప్పర్లు, ఒక జేబీబీని అక్రమంగా రిజర్వాయర్ వద్దకు పంపించారు. టిప్పర్లలో ఇసుకను నింపుతుండగా..అనుమతులు ఎవరిచ్చారని కాపలా సిబ్బంది డ్రైవర్లను ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తించి బెదిరించారు. విషయాన్ని కాంట్రాక్టు సంస్థ ఉద్యోగుల దృష్టికి తేవడంతో వారు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇంతలో విష యం తెలుసుకున్న రైతులు టిప్పర్లు, జేసీబీని అడ్డుకున్నారు. రిజర్వాయర్ పనులకోసం భూములు కోల్పోయామని తమకు అందాల్సిన పరిహారం, ఇతర ప్రయోజనాలను ప్రభుత్వం అందించే వరకు ఇసుక, కంకరను తీసుకెళ్లనివ్వమని పట్టుబట్టారు. అప్పటికే కొన్ని టిప్పర్ల ఇసుక తరలిపోయింది. మిగిలిన టిప్పర్లు, జేసీబీ కదలకుండా రైతులు అడ్డుకున్నారు.

తరలించకుండా చర్యలు

రిజర్వాయర్ వద్దకు వచ్చిన తహసీల్దార్ తపస్వి, మైన్స్ అధికారి ఆర్.కుమార్, పోలీసులు ఇసుక నిల్వలను పరిశీలించారు. నిర్మాణ పనులు, ఇసుక నిల్వ లు ఎన్‌జీటీ కేసు పరిధిలో ఉన్నాయని స్పష్టం చేశా రు. ఇసుకను ఎవరూ తరలించకుండా చర్యలు తీసుకుంటామని, కేసు ఉన్నంత వరకు ఇసుకను కాపాడే బాధ్యత తమదని చెబుతూనే ఇసుక కోసం వచ్చిన టిప్పర్లను పంపించేస్తామంటూ వెళ్లిపోయారు. కోర్టు కేసులోని ఇసుకను తరలించేందుకు అక్రమంగా వచ్చిన టిప్పర్లు, జేసీబీకి సంబంధించి ఎవరైనా ఉత్తర్వులు ఇచ్చారా, అనుమతి లేకుండా అక్రంగా ఇసుక తరలింపు ఎందుకు వచ్చారని అధికారులు కనీసం విచారణ కూడా జరపకనే వెనుదిరిగి వెళ్లారు.

ఉద్యోగికి బెదిరింపు

రిజర్వాయర్ వద్ద నిల్వ ఉన్న ఇసుకను తరలిపోకుండా అధికారులకు సమాచారం ఇచ్చారని కాంట్రాక్టు సంస్థకు చెందిన ఓ ఉద్యోగిని కొందరు ఫోన్‌లో బెదిరించారు. మా పనులకే అడ్డుపడ్డావా..నీ సంగతి చూస్తామంటూ బెదిరించారు.

రిజర్వాయర్ వ్యవహారంలోనే చంద్రబాబుపై కేసు

ప్రతిపక్షనేతగా 2023 ఆగస్టు 4న కురబలకోట మండలం అంగళ్లకు వచ్చిన చంద్రబాబుపై కేసు నమోదైంది కూడా ముదివేడు రిజర్వాయర్ విషయంలోనే. ఆ రోజున.. టిడిపీ నేతలు కోర్టుకు వెళ్లి రిజర్వాయర్ పనులు నిలివేయించారని దీనిపై వినతిపత్రం ఇచ్చేందుకు రైతులు అంగళ్లు వచ్చారు. ఈ సందర్భంగా జరిగిన ఘటనలకు చంద్రబాబు కారణమని ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి ఆయన్ను మొదటి ముద్దాయి చేసారు. అప్పటినుంచి ఇసుక నిల్వలు అలాగే ఉండగా ఇప్పుడు అక్రమంగా తరలించుకుని సొమ్ము చేసుకునే ప్రయత్నాలకు ఒడిగట్టారు.

సీజ్ చేయకుండా వదిలేశారు

రిజర్వాయర్ వద్ద ఇసుక పరిశీలనకు వచ్చిన అధికారులకు అక్కడే ఉన్న టిప్పర్లు, జేసీబీని చూశారు. కేసు పరిధిలో ఉన్న ఇసుకను తరలించకూడదని, ఇసుకను కాపాడతామని చెప్పిన అధికారులు వాటిపై చర్యలు తీసుకుంటామని చెప్పలేదు. అనుమతి లేకుండా ట్రాక్టర్ ఇసుకను తరలిస్తేనే కేసులు నమోదయ్యాయి. అలాంటిది ఎన్‌జీటీ కేసు పరిధిలోని ఇసుక నిల్వలను బహిరంగంగా తరలించుకునేందుకు వచ్చిన వారిపై చర్యలు తీసుకోకుండా వదిలేయడం, టిప్పర్లు, జేసీబీలను ఎందుకు సీజ్ చేయలేదో అధికారులే సమాధానం చెప్పాలి. వీటిని టీడీపీకి చెందిన కొందరు నాయకులు పంపించారని, వారి ఒత్తిళ్లతో చర్యలు లేకుండా వదిలేశారని ఆరోపిస్తున్నారు. ఇసుకను దోచుకునేందుకు టీడీపీ నేతల ప్రమేయం ఉన్నందునే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. సామాన్యులు ఇసుకను తరలిస్తుంటే అధికా రులు ఇలానే వదిలేస్తారా అని గ్రామస్తులు ప్రశ్నిస్తు న్నారు. టిప్పర్లు, జేసీబీ పంపిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

హంద్రీనీవా కాలువలో ఇక నీరు రానట్టే?

- ఏపీ, తెలంగాణాలు నికరజలాలను వాడుకున్నాకే ఇక్కడికట
- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు తేల్చి చెప్పిన కూటమి సర్కారు
- నికరజలాలు పోతే మిగులు జలాలు కుప్పానికి రానట్టే
- అందుకే పీబీసీ, కేజీసీ కాలువ లైనింగ్ పనులకు ప్రాధాన్యం


పలమనేరు నియోజకవర్గంలోని పుంగనూరు ఉప కాలువ (ఫైల్)


నీళ్లుండి వినియోగించుకోలేని చెర్లోపల్లి రిజర్వాయర్

పలమనేరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పడమటి ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందించాలన్న లక్ష్యంతో.. ఇక్కడి ప్రజలకు కల్పతరువవు తుందనుకున్న హంద్రీనీవా కాలువలో కృష్ణా జలాలు భవిష్యత్తులో రానట్టేనని తెలుస్తోంది. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-1 తీర్పు అమల్లో ఉన్నంత కాలం.. కృష్ణాలోని 811 టీఎంసీల నికరజలాలను ఏపీ, తెలంగాణలు వాడుకొని ఆపై మిగులు జలాలు మాత్రమే హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేస్తారట. ఆ మేరకు బ్రిజేష్‌కుమార్ ట్రిబునల్‌కు కూటమి ప్రభుత్వం స్పష్టంగా చెప్పింది. దీన్ని బట్టి చూస్తే రానున్న కాలంలో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి హంద్రీనీవాకు నీరు వచ్చే అవకాశం లేనట్టుగా తెలిసిపోయింది. ప్రధాన కాలువకే నీరు రాకుంటే.. ఇందులో అంతర్భాగమైన పుంగనూరు ఉపకాలువ, కుప్పం ఉపకాలువలు అలంకార ప్రాయంగా మారడం ఖాయం.

కాలువలో నీరు రాకున్నా సరే లైనింగ్ పనులు చేసుకుందాం

హంద్రీ-నీవా సుజల స్రవంతి రెండో దశలో అంతర్భాగమైన పుంగనూరు బ్రాంచి కెనాల్ విస్తరణ కోసం గత ప్రభుత్వం రూ.1219.93 కోట్లతో చేపట్టిన పనులను కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. అయితే పీబీసీ కాంక్రీట్ లైనింగ్ పనుల కోసం రూ.480.22 కోట్లకు ప్రభుత్వ అనుమతులు ఇచ్చినట్టు జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఇప్పటికే ఉత్తర్వులను జారీ చేశారు. ఈ లైనింగ్ పనుల ద్వారా పీబీసీ ప్రవాహ సామర్థ్యాన్ని 145 నుంచి 282 క్యూసెక్కులకు పెంచే లక్ష్యంగా పేర్కొన్నారు. క్రిష్ణా ట్రిబునల్ ఆదేశాలు మిగులు జలాలు మాత్రమేనని స్పష్టం చేశాక కూడా నీరు రాని కాలువలో నీటి సామర్థ్యాన్ని ఎలా పెంచుతారో కూటమి ప్రభుత్వానికే తెలియాలి. ఇప్పటికే కుప్పం బ్రాంచి కెనాల్‌కు సైతం లైనింగ్ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.161.78 కోట్లతో టెండర్లను ఆహ్వానించిన విషయం తెలిసిందే. దీన్నిబట్టి చూస్తే కాలువలో నీరు రాకున్నా ఫర్వాలేదు గానీ.. లైనింగ్ పనులతో కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకు సిద్ధమైందని అర్థమవుతోంది.

ఇది పుంగనూరు కాలువ స్వరూపం

హంద్రీనీవా ప్రధాన కాలువ ఉమ్మడి కర్నూలు జిల్లా మల్యాల నుంచి ప్రారంభమై 554 కి.మీ ప్రయాణించి అన్నమయ్య జిల్లా కేవీపల్లి మండలంలోని అడవిపల్లి రిజర్వాయర్ వద్ద ముగుస్తుంది. ఈ ప్రధాన కాలువలోని 400 కి.మీ వద్ద అనంతపూరు జిల్లాలో బొంతలపల్లి వద్ద ఉమ్మడి చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించడంతో పుంగనూరు ఉపకాలువ మొదలవుతుంది. అక్కడి నుంచి తంబళ్ళపల్లి, మదనపల్లి, పుంగనూరు నియోజకవర్గాల మీదుగా పలమనేరు నియోజకవర్గంలోని గంగవరం మండలం పశపత్తూరు 224 కి.మీ వద్ద ముగుస్తుంది. అక్కడి నుంచి కుప్పం ఉపకాలువ మొదలవుతుంది. దీంతో ఈ నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు సాగునీరు, పది లక్షల మందికి తాగు నీరందించడమే దీని లక్ష్యం.

పూర్తిగా నిండిన చెర్లోపల్లి రిజర్వాయర్ నీళ్లు వృథానే

వర్షాల కారణంగా శ్రీసత్యసాయి జిల్లాలోని చెర్లోపల్లి జలాశయం 1.5 టీఎంసీల నీటితో నిండుకుండను తలపిస్తోంది. ఇదే సమయంలో పుంగనూరు, పలమనేరు కుప్పం నియోజకవర్గాల్లో 90 శాతం చెరువులకు చుక్కనీరు లేదు. ఇప్పుడు చేస్తున్న లైనింగ్ పనులను కొంత సమయం ఆపి జలాశయంలో నుంచి నీటిని.. పుంగనూరు ఉపకాలువ నుంచి కుప్పం ఉప కాలువకు కృష్ణా జలాల విడుదల చేసుంటే ఈ ప్రాంతాల్లోని చెరువులు నిండి పంటపొలాలకు సాగునీటి ఇబ్బందులు తప్పేవి. ఇక్కడి చెరువులు నిండాక లైనింగ్ పనులు చేపట్టినా ఇక్కడి రైతులకు వచ్చే నష్టమేమి లేకుండా ఉండేది. కానీ కూటమి ప్రభుత్వం చెర్లోపల్లి నుంచి నీటి విడుదలకు చిత్తశుద్ధి చూపకుండా కేవలం కాంట్రాక్టర్ల కోసం అటు పుంగనూరు, ఇటు కుప్పం బ్రాంచి కెనాల్‌ల లైనింగ్ పనులకు పూనుకుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మదనపల్లె : ప్రేమ వివాహం చేసుకొని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చిత్తూరు జిల్లా పూతలపట్టుకు చెందిన నాజున్ని (22)కి మదనపల్లి పట్టణ శివాజీ నగర్‌కు చెందిన హరీష్ ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. అనంతరం బాధితురాలని వదిలించుకోవాలని చూడగా, ఆమె పూతలపట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో 2023 నవంబర్ మూడో తేదీన హరీష్‌ను స్టేషన్‌కు పిలిపించి, ప్రేమ వివాహం చేసుకునేలా ఒప్పించి సమస్యను పరిష్కరించారు. దీంతో నాజున్ని, హరీష్ ఇద్దరు ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే కొద్ది కాలం అనంతరం తిరిగి హరీష్ ఆమెను నిర్లక్ష్యం చేసి వదిలి వచ్చేశాడు. ఆమె పలుమార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో, శుక్రవారం మదనపల్లెకు చేరుకుని తనకు జరిగిన అన్యాయంపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కణితి మాంసం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

కురబలకోట : కణితి మాంసం తరలిస్తుండగా మండలంలోని మండ్యంవారిపల్లెకు చెందిన శివ (42)ను అరెస్టు చేసినట్లు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ తెలిపారు. స్థానిక అటవీ ప్రాంతం నుంచి కణితి మాంసం తెస్తుండగా గుర్తించి మాంసాన్ని స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వివరించారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ఓబులవారిపల్లె : మండలంలోని వైకోట గ్రామానికి చెందిన కె.చంద్రయ్య (26) అనే కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడి గురువారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రయ్య కౌలుకు తీసుకున్న భూమిలో వ్యవసాయం చేస్తూ జీవించే వాడు. ఇద్దరు అక్కలకు వివాహం చేశాడు. ఈక్రమంలో అప్పులు ఎక్కువ కావడంతో వడ్డీలు కట్టలేక కలత చెందాడు. డిసెంబర్ 28వ తేదీన ఇంట్లో విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడగా అపస్మారక స్థితిలో ఉన్న చంద్రయ్యను కుటుంబ సభ్యులు గమనించి తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ పి.మహేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు దుకాణం తనిఖీ


పురుగుల మందును పరిశీలిస్తున్న ఏడీఏ

సిద్దవటం : సిద్దవటంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర పురుగుల నివారణ మందు, విత్తనాల దుకాణాన్ని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ శుక్రవారం తనిఖీ చేశారు. రిజిస్టర్‌లు, ధరల పట్టిక, బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్, లైసెన్స్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గడువు ముగిసిన పురుగుల మందును అమ్మరాదన్నారు. నాణ్యమైన విత్తనాలు, పురుగుల మందులు మాత్రమే అమ్మాలన్నారు. లేనిచో చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని తిరుగు ప్రయాణంలో కారు డ్రైవర్ నిద్ర మత్తులో స్పీడ్‌ను కంట్రోల్ చేయలేక అదుపు తప్పి కనుమలోపల్లె గ్రామ సమీపంలోని రోడ్డు పక్కనున్న కల్వర్టును ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిలో నాగరాజు, రమేష్, రామారవు, దుర్గారావు ఉన్నారు. వీరంతా తూర్పు గోదావరి జిల్లా ఏలూరు ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించామని హైవే పెట్రోలింగ్ పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. జరిగిన ప్రమాదంపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఐషర్ వాహనం ఢీకొని..

మదనపల్లె : ఐషర్ వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం సాయంత్రం మదనపల్లి మండలంలో జరిగింది. డ్రైవర్స్ కాలనీలో నివాసం ఉంటున్న చౌడప్ప కుమారుడు రెడ్డప్ప (60) స్థానికంగా ఓ సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళ్తుండగా.. మార్గంమధ్యలోని పుంగనూరు బైపాస్ రోడ్డు వై జంక్షన్ సమీపంలో కూరగాయల లోడుతో వెనక నుంచి వచ్చిన ఐషర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రెడ్డప్ప తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

గుండ్లపల్లి పొలిమేరల్లో చిరుత కలకలం



చిరుత అడుగుజాడలుగా భావిస్తున్న గుర్తులు, అడుగుజాడలను పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

భయాందోళనలో పరిసర గ్రామాల ప్రజలు

రామసముద్రం : మండలంలోని మూగవాడి, గుండ్లపల్లి పరిసర ప్రాంతాల పొలిమేరల్లో శుక్రవారం ఉదయం చిరుత పులి సంచరించిందనే కలకలం రేగింది. చిరుత పులి మూగవాడి వైపు నుంచి గుండ్లపల్లి పొలాల్లో వెళ్తుండగా.. సమీపంలోని పొలం పనుల్లో ఉన్న తాను చూశానని కెసి పల్లికి చెందిన అరుణమ్మ తెలిపింది. పొడవాటి అడుగులు వేస్తూ పరుగులు తీస్తూ సమీపంలోని తూము కుంట వైపు వెళ్లినట్లు ఆమె పేర్కొంది. వెంటనే విషయాన్ని గుండ్లపల్లి గ్రామస్తులకు సమాచారం అందించడంతో.. ప్రజలు అక్కడికి చేరుకుని అటవీశాఖ సిబ్బంది చిట్టిబాబుకు సమాచారం అందించారు. ఆయన అక్కడికి చేరుకుని విచారణ చేశారు. మడికయ్యల్లో పొడవునా చిరుత అడుగుజాడలను గుర్తించారు. విషయం దావనంలా వ్యాపించడంతో పశువులు, మేకలు, గొర్రెల కాపర్లతో పాటు వ్యవసాయ రైతులు, కూలీలు భయాందోళనకు గురయ్యారు. ఇదిలా ఉండగా చిరుత కాకుండా అడవిజంతువు ఏదైనా ఉండొచ్చని అటవీ సిబ్బంది తెలిపారు. అయినా పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు గ్రామాల్లో టాం.. టాం వేయించాలని సూచించారు.

పక్కాగా చిరుతను చూశాను



నేను పొలం పనుల్లో ఉండగా పొలిమేరల్లో చిరుత పరుగులు తీస్తూ వెళ్లడం నా కళ్లారా చూశాను. భయపడి మేము పంట పొలంలో దాక్కున్నాము. చిరుత అడుగుజాడలు కూడా పొలంలో పడ్డాయి.

– అరుణమ్మ, మహిళా రైతు

నిరుద్యోగులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

రాయచోటి అర్బన్ : నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం, ఉద్యోగావకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్, సీపీఐ రాయచోటి కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ రాయచోటి ఏరియా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకులు అనుసరిస్తున్న విధానాల కారణంగా దేశం, రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోందన్నారు. 3వ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం యువత భావోద్వేగాలను రెచ్చగొడుతూ దేశంలో అశాంతి పరిస్థితులను సృష్టించడం తప్ప యువతకు చేయూతనిచ్చే ఎలాంటి కార్యక్రమాలను చేపట్టలేదంటూ ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణ సమయాన్ని రోజురోజుకు పెంచుకుంటూ పోవడం తప్ప ఉద్యోగ నియామకాలు చేపట్టే పరిస్థితులు దాదాపుగా కనిపించడం లేదంటూ తెలిపారు. పాలకులు పనితీరు ఇలాగే కొనసాగితే నిరుద్యోగ యువత వారికి తగురీతిలో బుద్ధి చెప్పక తప్పదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్

ఏఐవైఎఫ్ నూతన కమిటీ ఎంపిక

సమావేశంలో ఏఐవైఎఫ్ రాయచోటి ఏరియాకు నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. అధ్యక్షుడుగా అనిల్‌కుమార్, కార్యదర్శిగా ఈ.వి.సుదర్శన్, ఉపాధ్యక్షులుగా హరి, ఓబులేశు, సహాయ కార్యదర్శులుగా జగదీష్, బాబులు, కోశాధికారిగా ఆంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా గణేష్‌నాయక్, చంద్రనాయక్, ప్రసాద్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పలువురు ఏఐవైఎఫ్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విలేకరిపై టీడీపీ నేతలు కర్రలతో దాడి

- దాడి చేసిన వారిపై కేసు నమోదు
- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

తొండూరు : తొండూరులో ఓ దినపత్రిక(సాక్షి కాదు) విలేకరి ఎస్.భాస్కర్‌రెడ్డిపై శుక్రవారం ఉదయం టీడీపీ నాయకులు కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటనకు సంబంధించి తొండూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితుడు పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా రిపోర్టర్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తొండూరు మండలం ఇనగలూరు గ్రామానికి చెందిన కొంత మంది టీడీపీ నాయకులు ఉద్దేశ పూర్వకంగా దాడి చేశారన్నారు. ఇనగలూరు గ్రామానికి చెందిన మూరంరెడ్డి ఓబుల్‌రెడ్డి అనే రైతుకు చెందిన చీనీ చెట్లకు అధికారులు బిల్లులు పెట్టకపోవడంతో ఆ రైతు విలేకరులను సంప్రదించారన్నారు. దీంతో విలేకరులు గురువారం సాయంత్రం బిల్లుల విషయమై ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి ఎంపీడీఓ విష్ణు ప్రసాద్‌ను కలిసి వివరణ కోరగా.. రేపు ఉదయం ఆ రైతుకు సంబంధించిన బిల్లులు పెడతామని, సమస్య లేకుండా చేస్తామని తెలిపారన్నారు. తాము ఇంటికి వెళ్లే సమయంలో ఇనగలూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ప్రశాంత్ కుమార్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, గంగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిలు వెంబడించారని, అక్కడ విలేకరులందరూ ఉండటంతో తనను ఏమీ చేయలేకపోయారన్నారు. ఈ విషయమై శుక్రవారం ఉదయం ఎస్ఐకి ఫిర్యాదు చేయడానికి వెళుతున్న సమయంలో.. తొండూరు బస్టాప్ వద్దకు రాగానే కారులో వారు వచ్చి తనను ఆపి కర్రలతో తీవ్రంగా కొట్టి దాడి చేసి పరారయ్యారన్నారు. ఈ ఘటనకు సంబంధించి తొండూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అనంతరం చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చానని తెలిపారు.


బాధితుడు భాస్కర్‌రెడ్డి

10 నుంచి టెన్నిస్ డబుల్స్ టోర్నీ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు తిరుపతిలోని ఆఫీసర్స్ క్లబ్, టౌన్ క్లబ్‌లలో సనాల నాగముని మెమోరియల్ టెన్నిస్ డబుల్స్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు క్రీడా భారతి అసోసియేషన్ తిరుపతి జిల్లా కార్యదర్శి దండు రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు 40 నుంచి 70 ఏళ్ల పైబడ్డ రాయలసీమ జిల్లాలతోపాటు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. 40 ప్లస్, 50ప్లస్, 60ప్లస్, 70ప్లస్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామని, ప్రతి విభాగంలో విన్నర్స్‌కు రూ.5వేలు, రన్నర్స్‌కు రూ.3వేలతోపాటు ప్రతిభ చాటిన వారికి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్టు తెలియజేశారు. ఇతర వివరాలకు 94911 45556, 94402 45980, 94412 96125 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు వృద్ధుడి మృతదేహానికి పోస్టుమార్టం


అల్లాడుపల్లె వీరారెడ్డి మృతి కేసులో నిందితులుగా ఉన్న హరినాథరెడ్డి, నరసింహా (ఫైల్)


సీసీ ఫుటేజీలో బయటపడ్డ వృద్ధుడిని హత్య చేస్తున్న యువకుల దృశ్యం

మైదుకూరు : మున్సిపాలిటీలోని శెట్టివారిపల్లెలో హత్యకు గురైన అల్లాడుపల్లె వీరారెడ్డి అనే వృద్ధుడి మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు. డిసెంబర్ 6న వీరారెడ్డి మృతి చెందగా సహజ మరణంగా భావించి అంత్యక్రియలు చేశారు. అయితే ఆయన మృతిపై రెండో భార్య కుమారుడు రమేష్ అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. వీరారెడ్డి పెద్ద భార్య మనవడు హరినాథ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేస్తున్నారు. విచారణలో భాగంగా శనివారం వీరారెడ్డి మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం చేయించనున్నట్లు అర్బన్ సీఐ సయ్యద్ హాసం తెలిపారు.

సవరణ : సాక్షిలో శుక్రవారం 'డామిట్ కథ అడ్డం తిరిగింది' కథనంలో చిత్రాలు తప్పుగా ప్రచురితమైన విషయాన్ని గమనించగలరు.

ట్రాక్టర్ల దొంగతనం కేసు నమోదు

సింహాద్రిపురం : సింహాద్రిపురంలో ట్రాక్టర్ల ట్రాలీల దొంగతనం కేసు నమోదైనట్లు ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం అంకాలమ్మ గూడూరు చెందిన కె.శ్రీనివాసరెడ్డి తన ట్రాక్టర్ ట్రాలీ దొంగలు తీసుకెళ్లినట్టు ఫిర్యాదు చేశాడు. పోలీసులు రంగం ప్రవేశం చేసి వివిధ మండలాల్లో ఉన్న సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు. తొండూరు మండలం మల్లేల గ్రామంలో ట్రాక్టర్, రెండు ట్రాలీలను గుర్తించి పట్టుకున్నారు. వీటిని సింహాద్రిపురానికి చెందిన బాబా ఫకృద్దీన్ అలియాస్ చోటు దొంగలించినట్లు నిర్ధారించి కేసు నమోదు చేశారు. అతడిని అరెస్ట్ చేశారు.

రేషన్ బియ్యం బస్తాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం బస్తాలతో రెవెన్యూ అధికారులు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని లింగాపురం గ్రామ సమీపంలో ఉన్న ఆటో నగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 184 బస్తాల చౌక బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తమకు వచ్చిన సమాచారం మేరకు తహసీల్దార్ గంగయ్య, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున శుక్రవారం దాడులు నిర్వహించారు. 184 బస్తాల చౌక బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక పౌరసరఫరాల శాఖ గోడౌన్‌కు తరలించారు. అనంతరం అనాలసిస్ రిపోర్ట్‌కు బియ్యం శాంపిళ్లను పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌కు పంపి పంచనామా చేశారు. ఈ బియ్యం బస్తాలను విజిలెన్స్ అధికారులు జవహర్‌రెడ్డి, ఏఓ బాలగంగాధర్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ దాడులలో ఆర్ఐ మహేంద్రారెడ్డి, వీఆర్ఓ రామయ్య, రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ

కడప అర్బన్ : కడప నగరంలోని రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో పాలకొండలు జంక్షన్ దగ్గర పోలీసుల తనిఖీలో సుమారు ముప్పై వేల విలువ గల 6 కిలోల గంజాయిని రామకృష్ణనగర్‌కు చెందిన కాకి శివ అలియాస్ శివమణి దగ్గర నుంచి రిమ్స్ సీఐ తన సిబ్బందితో పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన రిమ్స్ ఎస్ఐ జయరాముడు, సిబ్బందిని కడప రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి అభినందించారు.

వాటర్ ట్యాంక్‌పై నుంచి పడి వ్యక్తికి గాయాలు


గాయపడిన రెడ్డి ప్రసాద్

మదనపల్లె : వాటర్ ట్యాంక్ పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమించిన సంఘటన శుక్రవారం వాల్మీకిపురం పట్టణంలో జరిగింది. కుమ్మర వీధిలో నివాసం ఉంటున్న రెడ్డి ప్రసాద్ (55) కుటుంబ సభ్యులు ఇంటి వద్ద వాటర్ ట్యాంక్‌కు సంపు నుంచి నీళ్ల వదిలారు. అయితే వాటర్ ట్యాంక్ నిండిపోయి నీళ్ల పొంగిపొర్లుతుండటంతో, ట్యాంక్‌పైకి ఎక్కి ఆపేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని వాల్మీకిపురం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అత్యవసర విభాగం వైద్యులు చికిత్సలు అందించారు. అయినా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

ఆటో డ్రైవర్ చైన్‌స్నాచింగ్ యత్నం

– ప్రతిఘటించిన మహిళపై కత్తితో దాడి


గాయపడ్డ స్వాతి

పీలేరు : ఆటో ఎక్కిన మహిళ మెడలో బంగారు చైనును డ్రైవర్ లాక్కొనే ప్రయత్నం చేయడం.. ప్రతిఘటించిన ఆమెపై కత్తి దాడి చేసిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం పీలేరులో చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. స్థానిక తిరుపతి రోడ్డులోని జర్నలిస్టు కాలనీలో నివాసం ఉంటున్న స్వాతి అనే మహిళ శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో పీలేరు టౌన్‌లోకి వెళ్లడానికి స్థానిక శశి హాస్పిటల్ వద్ద ఓ ఆటో ఎక్కింది. అయితే ఆటో ఎక్కగానే మహిళ మెడలోని బంగారు చైన్‌ను లాక్కొనేందుకు ఆటో డ్రైవర్ ప్రయత్నం చేశాడు. ఆమె తీవ్రంగా ప్రతిఘటించడంతో కత్తితో దాడి చేశాడు. దీంతో ఆమె మెడ, చేతికి గాయాలయ్యాయి. అక్కడి నుంచి ఆటో డ్రైవర్ ఉడాయించాడు. ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పెద్దముడియం : మండలంలోని కొండసుంకేసుల గ్రామంలో మేడిగం మహేశ్వరరెడ్డి(41) అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహేశ్వరరెడ్డి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. తనకు ఉన్న 8 ఎకరాల పొలంతో పాటు మరో 6 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవాడు. గత రెండు సంవత్సరాల నుంచి పంటలు సరిగా పండకపోవడంతో దాదాపు 10 లక్షల మేర అప్పులు అయ్యాయి. ఈ సంవత్సరం సాగు చేసిన మిరప, శనగ పంటలు వరుస వర్షాలకు దెబ్బతినటంతో అప్పులు తీర్చలేమోనని తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. గురువారం రాత్రి ఇంటిలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

తాగేందుకు డబ్బు ఇవ్వలేదని.. తండ్రిని చంపేశాడు

ప్రొద్దుటూరు క్రైం : మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని తండ్రినే హత్య చేసిన ఘటన ప్రొద్దుటూరులోని మోడంపల్లెలో చోటు చేసుకుంది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మోడంపల్లెలోని దళితవాడకు చెందిన రెడ్డిపోగుల వెంకటస్వామి (65) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతనికి భార్య లక్ష్మీదేవితోపాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వీరిలో వెంకటసుబ్బయ్య అనే కుమారుడు ఆటోనగర్‌లోని ఓ ఐరన్ షాపులో పని చేస్తున్నాడు. అతను ఇటీవల తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని గురువారం రాత్రి తండ్రిని అడిగాడు. డబ్బులు లేవని చెప్పడంతో ఇంట్లో ఉన్న కట్టె తీసుకొని వెంకటస్వామి తలపై కొట్టాడు. తలకు తీవ్ర రక్తస్రావమై అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

భార్యను వేధించిన భర్తపై కేసు

ముద్దనూరు : డబ్బులు ఇవ్వడం లేదని భార్యను వేధించి గాయపరచిన సంఘటనలో భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెనికలపాడు గ్రామానికి చెందిన సాంబశివుడు నిత్యం తాగి డబ్బుల కోసం భార్య గంగను వేధించేవాడు. శుక్రవారం ఉదయం డబ్బులు కావాలని భార్యను వేధించగా.. ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో కట్టెతో దాడి చేశాడు. ఈ సంఘటనలో ఆమె తలకు గాయమైంది. దీంతో స్థానికంగా ప్రథమ చికిత్స అనంతరం ఆమె ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు సాంబశివుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి కేసులో వ్యక్తి అరెస్ట్

చాపాడు : మండల పరిధిలోని టీటపల్లె లైన్‌మెన్‌గా పని చేస్తున్న సుబ్బరాయుడు అనే వ్యక్తిపై దాడి చేసిన ఇదే గ్రామానికి చెందిన కె.సుబ్బరాయుడును శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. పది రోజుల క్రితం టీటపల్లె గ్రామంలో విద్యుత్ సమస్యపై చిన్న పిల్లలను లైన్‌మెన్ మందలిస్తుండగా అక్కడే ఉన్న దళితవాడకు చెందిన కె.సుబ్బరాయుడు తననే లైన్‌మెన్ తిడుతున్నాడని భావించి దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో గాయపడిన లైన్‌మెన్ తనపై దాడి చేసిన సుబ్బరాయుడుపై పోలీసుకు ఫిర్యాదు చేశారు. కేసు నమెదు చేసుకున్న పోలీసులు నిందితుడిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ చెప్పారు.